ADVERTISING
నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

PRGI NO: APTEL/26/A5450
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం...

రిపోర్టర్లు కావలెను
జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది.
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.
Contact Number
9059328777

విజయవాడ శనివారం 22-08-2026 సంపుటి: 02 సంచిక : 50 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని
Vijayawada Saturday, 22-08-2026 Volume :02 Issue: 50 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani




# సరిహద్దుల భద్రతే దేశ భద్రత

- కంచెకు గత సీఎం మమత అడ్డుపడ్డారు
- భూమి ఇవ్వడానికి నిరాకరించారు
- సువేందు బెంగాల్ సీఎం అయ్యాక కంచెకు మార్గం
- సిలిగురిలో హోం మంత్రి అమిత్ షా వెల్లడి

**కోల్‌కతా**

పశ్చిమ బెంగాల్ సరిహద్దులు సురక్షితం కాకుండా భారతదేశం సురక్షితం కాదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. శుక్రవారం సిలిగురిలో శాస్త్ర సీమా బల్ సరిహద్దు ప్రధాన కార్యాలయంలో వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం ప్రసంగిస్తూ పశ్చిమ బెంగాల్ కానీ భారతదేశం కానీ సరిహద్దులు సురక్షితం కాకుండా సురక్షితంగా ఉండవని

-మిగతా 2 లో



## ఇమ్రాన్ ఖాన్ జైలులో ఉండటమే సురక్షితం..!

02

- నిర్ధారించిన వైద్యులు, హాస్పిటల్ నుంచి జైలుకు తరలింపు
- కట్టుదిట్టమైన భద్రత మధ్య జైలుకు పయనం
- సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రత్యేక వైద్య సేవలు
- 2023 ఆగస్టు నుంచి జైలు జీవితం
- తనపై కేసులు రాజకీయ ప్రేరేపితమన్న ఇమ్రాన్ ఖాన్
- ఆరోపణలను ఖండించిన పాకిస్థాన్ ప్రభుత్వం



## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

- బంగాళాఖాతంలో ఏర్పడిన మరో అల్పపీడనం
- తెలంగాణలో 28 వరకు వానలు!
- తెలంగాణలోని 16 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- ఏపీలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు
- కోస్తాలో తేలికపాటి నుంచి మోస్తరు వానలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావం కారణంగా తెలంగాణలో నేటి (ఆగస్టు 21) నుంచి ఈ నెల 28వ తేదీ వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రధానంగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

-మిగతా 2 లో

# అమరావతికి నాలుగు దారులు

**ఈ-13, ఈ-15 రోడ్లతో రాజధానికి కొత్త ప్రవేశ మార్గాలు**


- ఈ-15తో మంగళగిరి నుంచి అమరావతికి నేరుగా కనెక్టివిటీ
- జాతీయ రహదారి నుంచి ఎయిమ్స్ మీదుగా ఈ-13
- ఈ-3లో ఎలివేటెడ్ కారిడార్.. పనులు త్వరలో ప్రారంభం
- కరకట్టకు సమాంతరంగా ఈ-1 రహదారి
- విజయవాడ వైపు నుంచి అమరావతికి మరో ప్రత్యామ్నాయ మార్గం
- ట్రాఫిక్ భారం తగ్గించేందుకు బహుళ మార్గాల అభివృద్ధి
- పెండింగ్ అనుమతులు, భూసమస్యల పరిష్కారంపై దృష్టి
- నిర్దేశిత గడువులో రోడ్ల పనులు పూర్తి చేయాలని ఆదేశం

**అమరావతి:**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో రహదారి కనెక్టివిటీని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే సీడ్ యాక్సెస్ రోడ్డు అందుబాటులోకి రాగా.. రాజధాని నిర్మాణ పనులు ఊపందుకుంటున్న నేపథ్యంలో పెరగనున్న ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కీలకమైన ఈ-13, ఈ-15, ఈ-1, ఈ-3 రహదారులను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

-మిగతా 2 లో





02

## మయన్మార్‌లోని బౌద్ధ ఆశ్రమంపై వైమానిక దాడి..

- ధ్యాన కార్యక్రమం జరుగుతుండగా బాంబు దాడి
- ఘోర పేలుడులో 14 మంది మృతి
- మరో 20 మందికి పైగా గాయాలు
- మృతుల్లో మహిళలు కూడా.. కొనసాగుతున్న సహాయక చర్యలు
- మండాలే సమీపంలో ఘటన.. వెలుగులోకి వచ్చిన వివరాలు
- మయన్మార్‌లో కొనసాగుతున్న అంతర్యుద్ధం
- సైన్యం దాడులపై బాధిత గ్రూపుల ఆరోపణలు

## రిజర్వేషన్ హటావో



- జంతర్ మంతర్ వద్ద భారీ స్థాయిలో నిరసన
- మోడీకి ఎంవోయూ ఇచ్చాకే కదులుతాం : ఆర్గనైజర్ హర్ష్ దూబే
- పలువురు అరెస్ట్.. భారీగా బలగాల మోహరింపు

02

## హైదరాబాద్‌లో వైఎస్ జగన్




- సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు కుమారుడి వివాహానికి హాజరు
- జగన్ అభిమానుల సందడి
- కేసీఆర్, కేటీఆర్, జగన్ ఫ్లెక్సీలతో బీఆర్ఎస్ నేత ఘన స్వాగతం

02

# రచ్చకెక్కిన కాంగ్రెస్ రాజకీయాలు

**కూతురు వ్యాఖ్యలతో సురేఖ రాజీనామాకు ఎమ్మెల్యేల డిమాండ్**


- గుర్తింపు కోసమే సుష్మిత తాపత్రయమా?
- నల్లగొండలో మంత్రి పదవి కోసం రాజగోపాల్‌రెడ్డి పట్టు..
- ఉమ్మడి ఆదిలాబాద్‌లో బాహాబాహీ..
- పీసీసీ పట్టించుకోవడం లేదని కార్యకర్తల ఆవేదన



**/హైదరాబాద్**

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విబేధాలు మరోసారి రచ్చకెక్కాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎలా ఎన్నా వరంగల్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలో ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు, నాయకులు బహిరంగ విమర్శలు చేసుకుంటున్నారు. ఒకవైపు మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యవహారం నడుస్తుండగానే మరోవైపు కొండా సురేఖ్ కూతురు సుష్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీల ఆజ్యం పోశాయి. మంత్రి పదవి కోసం రాజగోపాల్‌రెడ్డి రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ ఒత్తిడి పెంచుతున్నారు. సుష్మిత కాంగ్రెస్‌పార్టీలో సీనియర్ నేత కాకపోయినా వరంగల్ జిల్లా రాజకీయాల్లో గుర్తింపు కోసమే

-మిగతా 2 లో



## చైనా మరో ఘనత

- ప్రపంచంలోనే అత్యంత పొడవైన సముద్రగర్భ హై-స్పీడ్ రైలు సొరంగం
- 21రోజుల్లోహై-ప్రెషర్ షీల్డ్ కట్టర్ పనులు పూర్తి

**జెజియాంగ్**

తూర్పు చైనాలోని జెజియాంగ్ ప్రావిన్స్‌లో ఉన్న నింగ్బో-జౌషాన్ రైల్వేలోని జింటాంగ్ సముద్రగర్భ సొరంగంలో కార్మికులు మరో ఘనత సాధించారు. 21 రోజుల పాటు అధిక నీటి పీడనంలో 104 షీల్డ్ కటింగ్ టూల్స్ తనిఖీ పనులు పూర్తి చేశారు. ప్రపంచంలోనే అత్యంత పొడవైన ఈ సముద్రగర్భ హై-స్పీడ్ రైలు సొరంగంలో ఇది ఒక ప్రధాన మైలురాయి. అంతేకాకుండా చైనా

-మిగతా 2 లో



## నీకు సీబీఐపై నమ్మకం ఉందా?

- ఆనాడు వివేకా హత్య కేసుపై సీబీఐ దర్యాప్తు ఎందుకు వద్దన్నావ్?
- చెల్లెలు సునీత డిమాండ్ ను కూడా పట్టించుకోలేదు కదా
- నీ తీరు దొంగే దొంగ అన్నట్లుంది
- రాబోయే రోజుల్లో మరిన్ని ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ
- జగన్ పై మంత్రి సవిత నిలదీత

**అమరావతి**

గ్రూప్ 1 లో జరిగిన అక్రమాలపై బయటకు పొక్కడంతో మెగా డీఎస్సీ నిర్వహణపై జగన్ దొంగే దొంగ అన్నట్లు ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మండిపడ్డారు. మెగా డీఎస్సీ అభ్యర్థుల ఆత్మగౌరవం దెబ్బతినేలా మాట్లాడుతున్న జగన్ కు చట్టాలపైనా, సీబీఐపైనా నమ్మకం ఉందా..? అని ప్రశ్నించారు. డీఎస్సీలపై తప్పుడు ఆరోపణలు చేయడం కాదని, అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని సవాల్ చేసినా ఆయన ముఖం చాటేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఇచ్చిన మాటకు

-మిగతా 2 లో

# సరిహద్దుల భద్రతే దేశ భద్రత

మొదటి తరువాయి

అన్నారు. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుపై కంచె వేయడానికి అవసరమైన భూమిని ఇవ్వాలని గత ముఖ్యమంత్రి మమతా బెనర్జీని పదేపదే అభ్యర్థించినా ఆమె అందించలేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. బీఎస్ఎఫ్ ద్వారా సరిహద్దు కంచెలు ఏర్పాటు చేయడానికి మమతా బెనర్జీకి నా ఆసక్తితో కూడిన అభ్యర్థనలు చెవిటి చెవులకు పడ్డాయి. 2014 నుంచి సరిహద్దు భద్రతను బలోపేతం చేయడానికి 1129 ఎకరాల భూమిని అడుగుతున్నాను. అధికారి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే ఆ భూమి మాకు లభించిందని ఆయన చెప్పారు. రాష్ట్రంలో గత ముఖ్యమంత్రులు ఎవరూ శాస్త్ర సీమా బల్ లేదా బీఎస్ఎఫ్ కార్యక్రమాలకు హాజరు కాలేదని చెబుతూ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారిని ఆయన అభినందించారు. శాస్త్ర సీమా బల్ ఏ రాజకీయ సంస్థ కాదని చెబుతూ గత ముఖ్యమంత్రులు సరిహద్దు దళాల వేడుకలకు దూరంగా ఉండటం తప్పుడు సంకేతాలు ఇచ్చిందని ఆయన అన్నారు. దేశం స్వాతంత్ర్యం పొందినప్పటి నుంచి గత ప్రభుత్వాలు జాతీయ గీతం వందేమాతరంకు తగిన గౌరవం ఇవ్వకపోవడంపై తాను విచారిస్తున్నానని కూడా చెప్పారు. ఈ సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రెడ్ ఫోర్ట్ వద్ద వందేమాతరం పూర్తి వెర్షన్ పాడే వరకు భారతదేశంలో ఎన్నడూ పాడలేదు.

# తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

మరోవైపు, ఆంధ్రప్రదేశ్ లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఏలూరు, పోలవరం ప్రాంతాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. అలాగే కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగిలిన కోస్తా జిల్లాల్లో చెదురుమదురు జల్లులు పడతాయని వివరించింది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

# ఇమ్రాన్ ఖాన్ జైలులో ఉండటమే సురక్షితం..!


**-నిర్థారించిన వైద్యులు, హాస్పిటల్ నుంచి జైలుకు తరలింపు**
**-కట్టుదిట్టమైన భద్రత మధ్య జైలుకు పయనం**
**-సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రత్యేక వైద్య సేవలు**
**-2023 ఆగస్టు నుంచి జైలు జీవితం**
**-తనపై కేసులు రాజకీయ ప్రేరేపితమన్న ఇమ్రాన్ ఖాన్**
**-ఆరోపణలను ఖండించిన పాకిస్తాన్ ప్రభుత్వం**



పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్(73) ఇస్లామాబాద్‌లోని షిఫా ఇంటర్నేషనల్ హాస్పిటల్ నుండి తిరిగి అడియాలా జైలుకు తరలించినట్లు ఆయన పార్టీ 'పాకిస్తాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్' ప్రతినిధి ఒకరు తెలిపారు. ఆరోగ్య సమస్యల నేపథ్యంలో ఆయనకు ప్రత్యేక వైద్య సేవలు అందించాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో వైద్య పరీక్షల కోసం అర్ధరాత్రి వేళ ఆయనను షిఫా ఇంటర్నేషనల్ తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు పూర్తయ్యాక ఆయనను కస్టడీలో ఉంచడం సురక్షితమని వైద్యులు నిర్ధారించడంతో ఆయనను అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య తిరిగి జైలుకు తీసుకువచ్చి, ఆయన సెల్‌కు తరలించినట్లు పాకిస్తాన్ మీడియా నివేదించింది. కాగా, ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుండి జైలులో ఉన్నారు. తనపై నమోదైన కేసులు రాజకీయ ప్రేరేపితమని ఆయన అంటున్నారు. అయితే, ప్రభుత్వం ఈ ఆరోపణను ఖండిస్తోంది.

# మయన్మార్‌లోని బౌద్ధ ఆశ్రమంపై వైమానిక దాడి..

న్యూఢిల్లీ



మయన్మార్‌లో దారుణ ఘటన జరిగింది. ఒక బౌద్ధ ఆశ్రమంపై మయన్మార్ సైన్యం జరిపిన వైమానిక దాడిలో 14 మంది మరణించారు. మరో 20 మంది వరకు గాయపడ్డారు. ఈ ఘటన మయన్మార్‌లోని రెండో పెద్ద పట్టణమైన మండాలేకు సమీపంలో ఉన్న సగేయింగ్ రీజన్, మ్యాయుంగ్ టౌన్‌షిప్ పరిధిలోని స్వెల్ లే హో గ్రామంలో జరిగింది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 9.00 గంటలకు ఈ దాడి జరిగింది. మ్యాయుంగ్ టౌన్‌షిప్‌కు సంబంధించిన రక్షణ వ్యవహారాలను చూసే సీడీఎస్ఓ అనే సంస్థ తరఫున న్యాయ్ ఊ అనే ప్రతినిధి ఈ వివరాల్ని వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం ఇక్కడి ఆశ్రమంలో ధ్యానానికి సంబంధించిన కార్యక్రమం జరుగుతుంది. ఇది వారం రోజులపాటు జరిగే ప్రత్యేక కార్యక్రమం. దీనికోసం అందరూ సమావేశమై ఉండగా, మయన్మార్ సైన్యం వైమానిక దాడి జరిపింది. ఆశ్రమం మధ్యలో బాంబు జారవిడిచింది. దీంతో భారీ పేలుడు కారణంగా 14 మంది మరణించారు. మరో 20 మంది గాయపడ్డారు. ఈ ఘటనలో మరణించిన వారిలో మహిళలు కూడా ఉన్నారు. మృతులు, క్షతగాత్రులకు సంబంధించిన పూర్తి వివరాలు, ప్రస్తుతం వారి పరిస్థితికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. మయన్మార్‌లో కొంత కాలంగా తీవ్ర సంక్షోభం, అంతర్యుద్ధం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వ ఆధీనంలోని ఆర్మీకి, అలాగే ప్రజాస్వామ్య సంఘాలకు, మతపరమైన, సంప్రదాయపరమైన సాయుధ బలగాలకు మధ్య ఘర్షణ ఏళ్లుగా కొనసాగుతోంది. దీంతో తరచూ ఆర్మీ, వేరే సంస్థల వారిపై దాడులు చేస్తోందని బాధిత గ్రూపులు ఆరోపిస్తున్నాయి

# చైనా మరో ఘనత

మొదటి తరువాయి

స్వతంత్రంగా అభివృద్ధి చేసిన సాంకేతికత, సుదీర్ఘమైన, అత్యధిక పీడనంతో కూడిన వాస్తవ ప్రపంచ పరీక్షలో ఉత్తీర్ణత సాధించింది.
11.21 కిలోమీటర్ల షీల్డ్ విభాగాన్ని కలిగి ఉన్న 16.18 కిలోమీటర్ల జింటాంగ్ సొరంగం, నింగ్బో-జౌషాన్ హై-స్పీడ్ రైల్వేలో అత్యంత కీలకమైన భాగం. ఇది ప్రధాన ఓడరేవు నగరమైన నింగ్బోను, దానికి తూర్పున ఉన్న జౌషాన్ దీవులతో కలుపుతుంది. ప్రస్తుతం, రోడ్డు లేదా ఫెర్రీ మార్గంలో ఈ ప్రయాణానికి 1.5 నుంచి 2 గంటల సమయం పడుతుంది. రైల్వే ప్రారంభమైన తర్వాత, ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ నిడివి 26 నిమిషాలకు తగ్గుతుంది. నింగ్బో , జౌషాన్ ద్వీపాల తీరాల నుంచి రెండు అతిపెద్ద వ్యాసం గల షీల్డ్ యంత్రాలు ఒకదానికొకటి ఎదురుగా సొరంగం తవ్వుతున్నాయి. ఖండాంతర అంచు వైపున ఉన్న "యోంగ్‌జౌ" షీల్డ్ యంత్రం, మార్గంలో దాదాపు 70 శాతం అయిన 4,940 మీటర్ల దూరాన్ని, అంటే ఒకదాని తర్వాత ఒకటిగా ఉండే మెత్తని, గట్టి రాతి పొరల గుండా తవ్వాల్సి ఉంటుందని ఈ సొరంగం నిర్మాణ సంస్థ అయిన చైనా రైల్వే 14వ బ్యూరో గ్రూప్ కంపెనీ తెలిపింది. రాతి బలం 191 మెగాపాస్కల్స్ (ఎంపీఏ)కు చేరుకుంటుంది, ఇది జియోమెకానికల్ రాతి వర్గీకరణలో "అధిక బలం" నుంచి "చాలా అధిక బలం" వర్గంలోకి వస్తుంది. దీనివల్ల కట్టర్‌లు తీవ్రంగా అరిగిపోతాయి. సముద్ర మట్టానికి 92 మీటర్ల దిగువన ఉన్న దాని అత్యంత లోతైన ప్రదేశంలో నీరు, నేల ఒత్తిడి 8.5 బార్‌కు చేరుకుంటుంది, అందులో 2,000 మీటర్ల పొడవునా ఈ ఒత్తిడి 6 బార్‌ను మించి ఉంటుంది. ఇంతటి తీవ్రమైన ఒత్తిడిలో కట్టర్‌లను మార్చడం షీల్డ్ టన్నెలింగ్‌లో అత్యంత కఠినమైన సవాళ్లలో ఒకటిగా విస్తృతంగా పరిగణించబడుతుందని కంపెనీ తెలిపింది.

# అమరావతికి నాలుగు దారులు



రాజధాని ప్రాంతానికి వివిధ ప్రాంతాల నుంచి సులభంగా, వేగంగా చేరుకునేలా బహుళ రహదారి మార్గాలను అభివృద్ధి చేయడంపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. అమరావతి నిర్మాణ పనులు వేగవంతం అవుతున్నందున రాబోయే రోజుల్లో రవాణా అవసరాలు భారీగా పెరిగే అవకాశం ఉందని.. ఒకే రహదారిపై ట్రాఫిక్ భారం పడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని అధికారులు, ఇంజనీర్లకు సూచించారు.

సీఆర్‌డీఏ కమిషనర్ విజయరామరాజు, అడిషనల్ కమిషనర్ కార్తీక్, గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మతో పాటు సంబంధిత ఇంజనీర్లు, అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ఆయా రోడ్ల నిర్మాణ పనుల పురోగతి, పెండింగ్ అనుమతులు, భూసంబంధిత అంశాలు, రైల్వే అనుమతులపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన రైల్వే, ఇతర అనుమతులు దాదాపు కొలిక్కి వచ్చాయని అధికారులు మంత్రికి వివరించారు.

**మంగళగిరి నుంచి అమరావతికి ఈ-15**

మంగళగిరి నుంచి నేరుగా అమరావతిలోకి ప్రవేశించే ఈ-15 రహదారి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రహదారి పూర్తయితే మంగళగిరి వైపు నుంచి రాజధానికి వచ్చే వాహనాలకు మెరుగైన రాకపోకల సౌకర్యం అందుబాటులోకి రానుంది. అమరావతికి మంగళగిరి వైపు నుంచి మరో కీలక ప్రవేశ మార్గంగా ఈ రోడ్డు మారనుంది.

**జాతీయ రహదారి నుంచి ఈ-13**

16వ నంబర్ జాతీయ రహదారి నుంచి ఎయిమ్స్ మీదుగా అమరావతిలోకి ప్రవేశించే ఈ-13 రహదారి కూడా రాజధాని రోడ్ నెట్‌వర్క్‌లో కీలకంగా మారనుంది. ఈ రహదారి పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. దీనివల్ల జాతీయ రహదారి వైపు నుంచి అమరావతికి వచ్చే వాహనాలకు నేరుగా, సులభమైన మార్గం ఏర్పడనుంది.

**ఈ-3.. ఎలివేటెడ్ కారిడార్**

ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన సీడ్ యాక్సెస్ రోడ్డుకు కొనసాగింపుగా ఈ-3 మూడో దశలో చేపడుతున్న ఎలివేటెడ్ కారిడార్‌పై మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారు. స్టీల్ బ్రిడ్జి నుంచి మణిపాల్ హాస్పిటల్ వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ పనులను త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కారిడార్ పూర్తయితే రాజధాని ప్రాంతంలోని కీలక ప్రాంతాల మధ్య రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.

**కరకట్టకు సమాంతరంగా ఈ-1**

సీడ్ యాక్సెస్ రోడ్డుకు సమాంతరంగా కరకట్టను వెడల్పు చేస్తూ ప్రకాశం బ్యారేజీ వరకు నిర్మిస్తున్న ఈ-1 రహదారి పనులపైనా మంత్రి సమీక్షించారు. ఈ రహదారి పూర్తయితే విజయవాడ వైపు నుంచి అమరావతికి మరో ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి రానుంది. దీంతో రాజధాని ప్రాంతంలో ఒకే మార్గంపై ఆధారపడే పరిస్థితి తగ్గుతుంది.

**నిర్ణీత గడువులో పూర్తి చేయాలి**

అమరావతిలో రహదారి మౌలిక వసతుల అభివృద్ధి అత్యంత కీలకమని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.
ఈ-13, ఈ-15, ఈ-1, ఈ-3 రోడ్ల పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్ల నిర్మాణానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అనుమతులు, భూసంబంధిత సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి రాజధాని ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు.

# హైదరాబాద్‌లో వైఎస్ జగన్

**- సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు కుమారుడి వివాహానికి హాజరు**
**- జగన్ అభిమానుల సందడి**
**- కేసీఆర్, కేటీఆర్, జగన్ ఫ్లెక్సీలతో బీఆర్ఎస్ నేత ఘన స్వాగతం**



**ఏపీ బ్యూరో**

మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ శుక్రవారం హైదరాబాద్‌లో పర్యటించారు. హైదరాబాద్‌లోని జలవిహార్ గ్రాండ్ లాన్స్‌లో జరిగిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు కుమారుడి వివాహానికి జగన్ హాజరయ్యారు. వధూవరులు స్నిగ్ధ, అనంత పినాక్ శర్మలను జగన్ ఆశీర్వదించి, వారికి హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. జగన్ హైదరాబాద్ పర్యటన సందర్భంగా నగరంలో ఆయన అభిమానుల కోలాహలంతో సందడి నెలకొంది. బేగంపేట విమానాశ్రయం నుండి జలవిహార్ వరకు దారులన్నీ జగన్ అభిమానులతో కిక్కిరిసి పోయాయి. ఈ రోడ్డు పొడవునా ఏర్పాటు చేసిన జగన్ ఫ్లెక్సీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లతో పాటు జగన్ ఫ్లెక్సీలను శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నేత చింతా రవీంద్ర యాదవ్ ఏర్పాటు చేయడం జగన్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది.

# రచ్చకెక్కిన కాంగ్రెస్ రాజకీయాలు

ముఖ్యమంత్రిని టార్గెట్ చేసినట్టు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో చాలాచోట్ల గ్రూపు రాజకీయాలు, ఆధిపత్య పోరు, ఎమ్మెల్యేలు, మంత్రులు, డిసిసి అధ్యక్షులు, సీనియర్ నేతలు, కొత్త, పాత నేతల మధ్య సమన్వయలోపం ఆ పార్టీ అధిష్టానాన్ని ఇరకాటంలో పడేస్తోంది. మంత్రి పదవుల విషయంలో ఎమ్మెల్యేలు, కొంతమంది నేతలు వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్లు తమకే కేటాయించాలని ఒత్తిడులు చేయడం, తమకు గుర్తింపు ఇవ్వడం లేదని మరికొందరు ఇలా అసంతృప్తులు రాజేస్తున్నారు. అయితే తమ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువని, ఇలాంటివి వచ్చి పోతుంటాయని, త్వరలోనే అన్ని సర్దుకుంటాయని ఆపార్టీ నేతలు అంటున్నారు. అందుకే కాంగ్రెస్‌పార్టీ నాయకత్వం లైట్‌గా తీసుకుందా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇవి టీ కప్పులో తుఫాన్ లాంటివి పలువురు నేతలు అంటున్నారు. లైట్‌గా తీసుకుంటే దీని ప్రభావం భవిష్యత్తులో కాంగ్రెస్‌పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడడానికి అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

**వరంగల్‌లో మంట లేపిన సుష్మిత వ్యాఖ్యలు ..**

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పరకాల ఎమ్మెల్యే టికెట్ వ్యవహారంతో మొదలైన వివాదం, మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత చేసిన సంచలన వ్యాఖ్యలతో తీవ్ర దుమారం రేపింది. తన టార్గెట్ కాంగ్రెస్ పార్టీ కాదని, కేవలం సీఎం రేవంత్ రెడ్డి మాత్రమేనని కొండా సుష్మిత చెప్పి మరింత వేడెక్కించారు. ఈ విషయాన్ని టీపీసీసీతో పాటు కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. సుష్మిత వ్యాఖ్యలు తనకు సంబంధం లేదని మంత్రి కొండా సురేఖ వివరణ ఇచ్చినప్పటికీ, ఎమ్మెల్యేలు వాటిని తిరస్కరిస్తున్నారు. సంబంధం లేనప్పుడు ఎందుకు ఖండించలేదని ప్రశ్నిస్తూ, 20 నుంచి 30 మంది ఎమ్మెల్యేలు సీఎల్పీ వేదికగా అత్యవసరంగా సమావేశం అయ్యారు. కొండా సురేఖ కుంటుంబం మొత్తాన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని వరంగల్ జిల్లా నేతలు డిమాండ్ చేస్తూ టీపీసీసీకి తీర్మానం పంపినట్లు సమాచారం. చర్య తీసుకునేవరకు కాంగ్రెస్ అధిష్టానం వెళ్లే అవకాశం ఉండదని అంటున్నారు. సుష్మిత వ్యాఖ్యలు పార్టీలో టీ కప్పులో తుఫాన్ లాంటివని కొంతమంది కొట్టిపారేస్తున్నారు. అదే సందర్భంలో కొండా సురేఖతో ఉమ్మడి వరంగల్ నేతలకు పొసగడం లేదు.

**నల్లగొండలో రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు దుమారం..**

నల్లగొండ డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్.కు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఒకరంటే ఒకరికి గిట్టని స్థితి. మంత్రి పదవి విషయంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సీఎంను బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఆయనపై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామేల్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మధ్య విభేదాలతో మిర్యాలగూడ కాంగ్రెస్ కార్యకర్తలు నలిగిపోతున్నారు.

# రిజర్వేషన్ హటావో

**- జంతర్ మంతర్ వద్ద భారీ స్థాయిలో నిరసన**
**- మోడీకి ఎంవోయూ ఇచ్చాకే కదులుతాం : ఆర్గనైజర్ హర్ష్ దూబే**
**- పలువురు అరెస్ట్.. భారీగా బలగాల మోహరింపు**




నేషనల్ బ్యూరో:
ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో సీజేపీ నిరసనలు మర్చిపోక ముందే.. మరోసారి నిరసనలు దద్దరిల్లాయి. కుల ఆధారిత రిజర్వేషన్లు, యూజీసీ ఈక్విటీ నిబంధనలకు వ్యతిరేకంగా శుక్రవారం నాడు 'రిజర్వేషన్ హటావో' పేరుతో ఇక్కడ భారీ నిరసన జరిగింది.
'రిజర్వేషన్ రీఫామ్ ఆందోళన్' పేరుతో జరిగిన ఈ ఆందోళనలో భారీ సంఖ్యలో నిరసనకారులు పాల్గొన్నారు. ఈ నిరసనలను కట్టడి చేసేందుకు ఢిల్లీ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్), ఐటీబీపీ బలగాలను భారీగా మోహరించారు. అన్‌రిజర్వ్‌డ్ వర్గానికి చెందిన ఆందోళనకారులు.. తాము ప్రస్తుతం అమలులో ఉన్న కులం ఆధారిత రిజర్వేషన్లు, యూజీసీ నిబంధనలకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసనలు చేస్తున్నామని స్పష్టం చేశారు. నీట్ అభ్యర్థి హర్ష్ దూబే నేతృత్వంలో జరుగుతున్న ఈ ఆందోళనకు రాజస్థాన్‌కు చెందిన జనరల్ సేన, చాణక్య సేనతోపాటు కర్ణి సేన కూడా మద్దతు ప్రకటించాయి. రిజర్వేషన్లు ఆర్థికస్థితిపై ఆధారపడి ఉండాలన్న నిరసనకారులు.. యూజీసీ నిబంధనలకు కూడా వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని కూడా వెనక్కు తీసుకోవాలని కొందరు డిమాండ్ చేశారు. ఈ చట్టాన్ని తీవ్రంగా దుర్వినియోగం చేస్తున్నారని, ఇలా జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని వాళ్లు చెప్పారు.

**వేదిక విషయంలో కన్ఫ్యూజన్**

ఈ నిరసనలు చేస్తున్న వేదికపై కొంత అయోమయం కలిగించింది. జంతర్ మంతర్ వద్ద నిరసన చేయడానికి అనుమతి ఇవ్వలేదని ఢిల్లీ పోలీసులు చెప్పగా.. తాము అక్కడే నిరసన మొదలుపెట్టామని, తమకు అనుమతి ఇచ్చే వరకు ఇక్కడే ఉంటామని ఆర్గనైజర్లు స్పష్టం చేశారు. తమ నిరసనలో పాల్గొనేందుకు వస్తున్న చాలామందిని పోలీసులు అడ్డుకుంటున్నారని హర్ష్ దూబే ఆరోపించారు. జంతర్ మంతర్ వద్ద నిరసనకు అనుమతి కోరుతూ గంటల తరబడి పోలీసులతో చర్చలు జరిపామని, చివరకు తమను రామ్‌లీలా మైదానానికి వెళ్లాలని వాళ్లు చెప్పారని ఆయన తెలిపారు. చివరకు జంతర్ మంతర్ వద్దనే నిరసన చేసుకునేందుకు అనుమతి లభించినట్టు తెలుస్తోంది. దీనిపై కూడా కొందరు విమర్శలు చేస్తున్నారు. సీజేపీ నిరసనలకు 3 గంటల్లోనే అనుమతి లభించిందని, కానీ 30 రోజులుగా అనుమతి కోరినా వీరికి ఇవ్వలేదని కేంద్రాన్ని పలువురు తప్పుబడుతున్నారు.

# నీకు సీబీఐపై నమ్మకం ఉందా?

మొదటి తరువాయి

క్యాలెండర్ అమలు చేస్తూ, కూటమి ప్రభుత్వం ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తుందని స్పష్టం చేశారు. మెగా డీఎస్సీలో టీచర్ పోస్టు సాధించిన పెనుకొండకు చెందిన టీచర్లు జ్యోతి, గంగాధర్ ఇళ్లకు శుక్రవారం వెళ్ళి వాళ్లతో మాట్లాడారు. అనంతరం మహిళా టీచర్ జ్యోతితో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. మెగా డీఎస్సీలో ఎటువంటి అక్రమాలు జరగలేదనడానికి తన పక్కనున్న మహిళా టీచరే ఉదాహరణ అని అన్నారు. డీఎస్సీలో రెండు పోస్టులకు ఆమె క్వాలిఫై అయ్యిందన్నారు. ఆమె తమ్ముడు కూడా డీఎస్సీ అర్హత పరీక్ష రాసినా, ఉత్తీర్ణత సాధించలేకపోయాడన్నారు. మెగా డీఎస్సీ పారదర్శకతను ఈ అక్కా తమ్ముడే నిదర్శనమన్నారు. జగన్ తాటాకు చప్పుళ్లకు కూటమి ప్రభుత్వం బెదరదని, రాబోయే రోజుల్లో మరిన్ని ప్రభుత్వ, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు. డీఎస్సీ అంటే సీబీఐ అని, సీబీఎస్ అంటే డీఎస్సీ అని మంత్రి సవిత స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు గారి ఆధ్వర్యంలో మెగా డీఎస్సీని అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించామని తెలిపారు. అభ్యర్థులు ఎలాంటి అపోహలకు, భయాలకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. టీచర్ల కష్టానికి దక్కిన ఈ విజయం వారికి గర్వకారణమని, కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి సవిత భరోసా ఇచ్చారు.

**గ్రూప్ 1 లో అక్రమాలతో జగన్ డ్రామాలు**

తన హయాంలో జరిగిన గ్రూప్ 1 పరీక్షల్లో మూల్యాంకనంలో జరిగిన తప్పిదాల నుంచి బయటపడడానికి జగన్ మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. దొంగే దొంగ అన్నట్లు మెగా డీఎస్సీపై జగన్ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. భర్త, పిల్లలకు, కుటుంబానికి దూరంగా ఉంటూ, అనంతపురంలో మెగా డీఎస్సీపై శిక్షణ పొందారన్నారు. వారి కష్టాన్ని తక్కువ చేస్తూ.. మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల మనోభావాలు, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా జగన్ మాట్లాడడం సరికాదన్నారు. జగన్ కు చట్టాలపైనా, సీబీఐపైనా మక్కువ ఉందా..? అని ప్రశ్నించారు. వైఎస్ వివేకా హత్య కేసులో తొలుత సీబీఐ దర్యాప్తు కోరిన జగన్, అధికారంలోకి రాగానే ఎందుకు మాటమార్చారని ప్రశ్నించారు. బాబాయ్ కూతురు, చెల్లెలు వైఎస్ సునీత ఎన్ని పర్యాయాలు కోరినా, వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు అవసరంలేదని చెప్పలేదా..? అని నిలదీశారు. బయటకూర్చొని మాట్లాడడం సరికాదని, అసెంబ్లీ వేదికగా చర్చ జరిపి ఉంటే వాస్తవాలు ప్రజలకు తెలిసేవని మంత్రి అన్నారు.

**మా మనస్సులను బాధపెట్టొద్దు : మహిళా టీచర్ జ్యోతి**

'పెనుకొండలో టీచర్ గా పనిచేస్తున్నానని, నా పిల్లల సాక్షిగా చెబుతున్నా... తాను కష్టపడి మెగా ఎస్సీలో ఉద్యోగం సాధించానని' మహిళా టీచర్ తెలిపారు. మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగి ఉంటే తనతో పాటు తన తమ్ముడికీ ఉద్యోగం సంపాదించేవాళ్ల కదా..? అని ప్రశ్నించారు. మెగా డీఎస్సీ కోసం ఎంతో కష్టపడి చదివానని, తాను రెండు పోస్టులకు అర్హత సాధించానని తెలిపారు. తమ కష్టాన్ని తక్కువ చేసి మాట్లాడడం సరికాదని ఆవేదన వ్యక్తంచేశారు.

## శ్రీ అచ్చమ్మ పేరంటాలు తల్లికి చీర, సారె సమర్పణ...



**ఏలూరు, ( నేటి దర్శిని )**
దెందులూరు మండలం గాలయిగూడెంలో శ్రీ అచ్చమ్మ పేరంటాలు తల్లి అమ్మవారికి శ్రావణ మాసం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో చీర, సారె సమర్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె చింతమనేని నవ్యశ్రీ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి చీర, సారె సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆకాంక్షించారు. కార్యక్రమానికి హాజరైన చింతమనేని నవ్యశ్రీకి గ్రామస్తులు, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం ఆమెకు తీర్థ ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాలను అందజేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జగన్‌ను కలిసిన జయరాజు దంపతులు



**నర్సాపురం, ఆగస్టు 21 ( నేటి దర్శిని )**
నర్సాపురం పురపాలక సంఘం మాజీ చైర్మన్, వైసీపీ నాయకుడు బర్రె శ్రీ వెంకట రమణ జయరాజు దంపతులు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో జగన్‌ను కలిసినట్లు వెంకట రమణ జయరాజు తెలిపారు. ఈ సందర్భంగా రానున్న రాఖీ పండుగను పురస్కరించుకుని జగనన్నకు రాఖీ కట్టి ముందస్తు శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు. కొద్దిసేపు సంస్థాగత విషయాలపై చర్చించిన జగన్.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని సూచించినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి కేడర్‌లో అవకాశం కల్పిస్తానని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అవకాశం ఉంటే టికెట్ ఇస్తానని జగన్ భరోసా ఇచ్చినట్లు వెంకట రమణ జయరాజు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అన్ని స్థానాల్లో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ పాలనపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలు వైసీపీ విజయానికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సత్యదేవుని సన్నిధిలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి..



**కాకినాడ ( నేటి దర్శిని )**
కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ సత్యదేవుని దేవస్థానాన్ని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దర్శించుకున్నారు. దేవస్థానానికి చేరుకున్న మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన పూజల్లో పాల్గొన్న అనంతరం అర్చకులు మంత్రికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని సత్యదేవుని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దేవస్థానం చేపడుతున్న కార్యక్రమాలను అధికారులు మంత్రికి వివరించారు. ఆలయ విశిష్టత, స్వామివారి సేవలు, భక్తుల కోసం అందిస్తున్న సౌకర్యాలపై వివరాలు అందించారు.

## మిడ్జిల్‌లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**ముగ్గురు పట్టివేత.. మరో ముగ్గురు పరారీ**


**మిడ్జిల్, ఆగస్టు 21( నేటి దర్శిని )**
మిడ్జిల్ మండల శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న



ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకోగా.. మరో ముగ్గురు అక్కడి నుంచి పరారైనట్లు తెలిపారు. స్థావరం వద్ద నుంచి రూ.2 వేల నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారైన ముగ్గురి కోసం గాలింపు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## పుట్టపర్తిలో 38 రోజుల ఉచిత ట్యాలీ--జీఎస్టీ శిక్షణ

**పుట్టపర్తి, ఆగస్టు 21 ( నేటి దర్శిని )**
యువతలో నైపుణ్యాలను పెంపొందించి, ఉపాధి అవకాశాలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, కెనరా బ్యాంకు రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో పుట్టపర్తిలో 38 రోజుల ఉచిత 'ట్యాలీ విత్ జీఎస్టీ--అసిస్టెంట్ బుక్ కీపర్' శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అకౌంటింగ్, బుక్ కీపింగ్, జీఎస్టీ రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలనుకునే యువతకు ఈ శిక్షణ మంచి అవకాశంగా నిలవనుంది.
ప్రస్తుత ఉద్యోగ, వ్యాపార రంగాల్లో కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్, ట్యాలీ సాఫ్ట్‌వేర్, జీఎస్టీ పరిజ్ఞానానికి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో శిక్షణను రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు.
ప్రాక్టికల్ అకౌంటింగ్, బుక్ కీపింగ్‌తో పాటు కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్, జీఎస్టీ ప్రాథమిక అంశాలు, జీఎస్టీ కంప్లయన్స్, ట్యాలీ సాఫ్ట్‌వేర్ వినియోగంపై శిక్షణ ఇవ్వనున్నారు. ఉద్యోగ రంగంలో ఎదురయ్యే వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకునేలా అనుభవజ్ఞులైన నిపుణులతో ప్రత్యేక ఉపన్యాసాలు, మార్గదర్శక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు.



**19 నుంచి 50 ఏళ్ల వారికి అవకాశం**
ఈ ఉచిత శిక్షణకు 19 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏదైనా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు లేదా సీఈసీ, ఎంఈసీ విభాగాల్లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు అర్హులని నిర్వాహకులు వెల్లడించారు. పుట్టపర్తితో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
**ఆర్ఎస్ఈటీఐ సర్టిఫికెట్**
శిక్షణను విజయవంతంగా పూర్తిచేసి నిర్దేశిత అర్హత సాధించిన అభ్యర్థులకు భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆర్ఎస్ఈటీఐ ద్వారా సర్టిఫికెట్ అందజేయనున్నారు. ఈ సర్టిఫికెట్ ద్వారా అభ్యర్థులు తమ నైపుణ్యానికి గుర్తింపు పొందడంతో పాటు ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలను అన్వేషించేందుకు ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు.
**ఆన్‌లైన్‌లో నమోదు**
ఈ శిక్షణకు హాజరు కావాలనుకునే అర్హులు పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్ లేదా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం 81794 71866, 76708 14583 నంబర్లను సంప్రదించాలని సూచించారు. అకౌంటింగ్, బుక్ కీపింగ్ రంగాల్లో భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు యువత ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని శ్రీ సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. "వయసు ఒక సంఖ్య మాత్రమే... నైపుణ్యమే అసలైన బలం" అనే సందేశంతో యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని ఆత్మవిశ్వాసంతో ఉపాధి రంగంలో ముందుకు సాగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

# సామాజిక ఆసుపత్రి త్వరలో వంద పడకల ఆసుపత్రిగా మార్పు

**-మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**కోటబొమ్మాళి, ఆగస్టు 21 ( నేటి దర్శిని )**
కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రిని త్వరలో వంద పడకల స్థాయి ఆసుపత్రిగా అభివృద్ధికి కృషి చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం లో నాబార్డ్ నిధులు రూ.290 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన ప్రసూతి, శిశు ఆరోగ్య కేంద్రం బ్లాక్‌ను శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను పెంచేలా అవగాహ కల్పించి ఆరోగ్య భద్రతకు చర్యలు



తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి సూచించారు. ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఆసుపత్రి నిర్వహణ, పరిశుభ్రమైన వాతావరణం, పారిశుద్ధ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి తెలిపారు. ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రోగులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్ ఖాన్, ఆర్డీఓ ఎం. కృష్ణమూర్తి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా. విజయలక్ష్మి, మాజీ పి ఏ సి ఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఝాన్సీ లక్ష్మి, మెడికల్ ఆఫీసర్లు పి. గణేష్, వైద్యులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్‌కు వెల్లువెత్తిన వినతులు..

**-అక్కడికక్కడే కొన్ని సమస్యల పరిష్కారం**
**-మరికొన్నింటిపై అధికారులకు ఆదేశాలు..**
**ఎమ్మెల్యే బడేటి చంటి**

**ఏలూరు, ఆగస్టు 21 ( నేటి దర్శిని )**
సమస్యల రహిత నియోజకవర్గంగా ఏలూరును తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్విరామంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా శుక్రవారం పవర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎమ్మెల్యే బడేటి చంటి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెన్షన్లు మంజూరు చేయాలని, ఇళ్ల



స్థలాలు ఇప్పించాలని పలువురు కోరగా.. మరికొందరు ఇతర సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే కొన్ని వాటిని అక్కడికక్కడే పరిష్కరించగా, మరికొన్నింటిపై సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వాధినేతల పిలుపు మేరకు ప్రజాదర్బార్‌ను నియోజకవర్గంలో నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించడంతో పాటు పేదలకు ఆర్థికంగా అండగా నిలిచే కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. సొంత ఇంటి స్థలం ఉన్నవారికి రుణ సదుపాయం కల్పించి ఇళ్ల నిర్మాణానికి సహకరించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. పెన్షన్లు, తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం అందేలా పారదర్శకంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఏలూరును ఆదర్శవంతమైన నియోజకవర్గంగా నిలపడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, టీడీపీ నగర కార్యదర్శి రెడ్డి నాగరాజు, పార్టీ నాయకులు బెల్లపుకొండ కిషోర్ తదితరులు పాల్గొన్నారు

# కాలుష్య నియంత్రణకు ఎలక్ట్రిక్ వాహనాలు ఎంతో ఉపయోగకరం

**-షాద్‌నగర్‌లో ఘనంగా "ఎంజి వన్" ఎలక్ట్రికల్ ఈవీ షోరూం ప్రారంభం**
**-ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 21( నేటి దర్శిని )**
పట్టణంలో "ఎంజి వన్" ఎలక్ట్రికల్ ఈవీ షోరూం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై షోరూంను లాంఛనంగా ప్రారంభించారు. షోరూం నిర్వాహకులు అక్కిగారి శ్రీధర్, అక్షయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వయంగా ఎలక్ట్రిక్ స్కూటర్‌ను నడిపి సంతోషం వ్యక్తం చేశారు. పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకుని పర్యావరణహితమైన ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన అన్నారు. ప్రజలు ఆధునిక సాంకేతికతతో కూడిన ఎలక్ట్రిక్ వాహనాలను



వినియోగించాలని సూచించారు. షోరూంలో 42 వేల నుంచి 1.42 లక్షల వరకు వివిధ ధరలలో ఎలక్ట్రిక్ స్కూటర్లు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. మోడల్‌ను బట్టి 60 కిలోమీటర్ల నుంచి 200 కిలోమీటర్ల వరకు రేంజ్ కలిగిన వాహనాలు ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం 12 విభిన్న మోడళ్లను వినియోగదారులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అదేవిధంగా స్కూటర్ కొనుగోలుపై ఆకర్షణీయమైన ఉచిత బహుమతులను అందిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. వాషింగ్ మిషన్, ఫ్రిడ్జ్, టీవీ, ఏసీ, వాక్యూమ్ క్లీనర్, హోమ్ థియేటర్ తదితర గిఫ్టుల్లో అవకాశాలు ఉంటాయని తెలిపారు. షాద్‌నగర్‌లో ప్రజలకు అందుబాటు ధరల్లో ఆధునిక ఎలక్ట్రిక్ వాహనాలను అందించడమే తమ లక్ష్యమని షోరూం నిర్వాహకులు అక్కిగారి శ్రీధర్, అక్షయ్ తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# బాక్సాఫీస్ వద్ద 'డీసీ' జోరు..

## రూ.100 కోట్ల క్లబ్‌లోకి లోకేష్ కనగరాజ్ సినిమా!




టాలెంటెడ్ డైరెక్టర్ అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో, ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'డీసీ' (ఐజ) సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం, విడుదలైన మొదటి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంటూ దూసుకెళ్తోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే భారీ వసూళ్లతో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తున్న ఈ చిత్రం తాజాగా రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరింది. దీంతో దర్శకుడిగా సత్తచాటిన లోకీ నటుడిగా కూడా తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. శరత్ చంద్ర చటోపాధ్యాయ క్లాసిక్ నవల 'దేవదాస్' స్ఫూర్తితో, అరుణ్ మాథేశ్వరన్ తనదైన మాస్ అండ్ రా యాక్షన్ శైలిలో తెరకెక్కించిన ఈ చిత్రం టాలీవుడ్ మరియు కోలీవుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో దేవదాస్ పాత్రలో లోకేష్ కనగరాజ్ తన తొలి నటనతోనే విమర్శకుల ప్రశంసలు అందుకోగా, చంద్ర పాత్రలో వామికా గబ్బి మరియు మరో ప్రధాన పాత్రలో సంజనా కృష్ణమూర్తి నటన సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన ఉత్కంఠభరితమైన నేపథ్య సంగీతం, ముకేష్ జి సినిమాటోగ్రఫీ, ప్రసన్న జి.కె ఎడిటింగ్ ఈ సినిమా స్థాయిని విపరీతంగా పెంచేశాయి.




# నయనతార 'మూకుతి అమ్మన్ 2'లో విలన్‌గా రెజీనా..


## రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో క్రేజీ సీక్వెల్!



కోలీవుడ్ స్టార్ హీరోయిన్ నయనతార నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాల్లో 'మూకుతి అమ్మన్ 2' ఒకటి. 2020లో విడుదలై మంచి విజయాన్ని అందుకున్న దైవభక్తి, ఫాంటసీ అంశాలతో తెరకెక్కిన 'మూకుతి అమ్మన్' సినిమాకు ఇది సీక్వెల్ కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తొలి భాగానికి ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించగా, రెండో భాగాన్ని ప్రముఖ నటుడు, దర్శకుడు సుందర్ సి తెరకెక్కిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం.. ఈ భారీ చిత్రంలో ప్రముఖ నటి రెజీనా కసాండ్రా కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు, ఆమె ఈ సినిమాలో ప్రతినాయక పాత్రలో కనిపించబోతున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది.ఈ పాత్ర కోసం దర్శకుడు సుందర్ సి ప్రత్యేకంగా ఓ శక్తివంతమైన క్యారెక్టర్‌ను డిజైన్ చేసినట్లు సమాచారం. రెజీనాను ఇప్పటివరకు ప్రేక్షకులు చూడని విధంగా, సరికొత్త లుక్‌లో ఈ సినిమాలో చూపించనున్నారట. నయనతారకు దీటుగా సాగే ఈ పాత్ర కథలో అత్యంత కీలకంగా ఉండబోతుందని టాక్. దీంతో 'మూకుతి అమ్మన్ 2'లో నయనతార వర్సెస్ రెజీనా పోరాటం ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో పెరిగింది. ఈ సినిమాను ప్రముఖ తమిళ నిర్మాత డాక్టర్ ఇషారి కె. గణేష్ తన వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. 'మూకుతి అమ్మన్ 2'ను రూ.100 కోట్లకు పైగా భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. తొలి భాగంతో పోలిస్తే రెండో భాగంలో విజువల్ ఎఫెక్ట్స్, ఫాంటసీ అంశాలు, యాక్షన్ సన్నివేశాలను మరింత భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది.సుందర్ సి ఇప్పటికే 'అరణ్మనై' హారర్-కామెడీ ఫ్రాంచైజ్‌తో భారీ విజయాలు అందుకున్నారు. ఫాంటసీ, హారర్, కామెడీ, విజువల్ ఎలిమెంట్స్‌ను ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కించడంలో ఆయనకు మంచి అనుభవం ఉంది. ఇప్పుడు 'మూకుతి అమ్మన్ 2'ను కూడా అదే స్థాయిలో భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నారని సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. థియేట్రికల్ విడుదల తర్వాత స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ వేదిక జియోహాట్‌స్టార్ భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సమాచారం. సినిమా ఫుటేజ్ చూసిన తర్వాతే ఈ డీల్ జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ఓటీటీ ఒప్పందానికి సంబంధించిన ఆర్థిక వివరాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అయినప్పటికీ, సినిమా విడుదలకు ముందే డిజిటల్ హక్కులకు ఇంతటి క్రేజ్ రావడం 'మూకుతి అమ్మన్ 2'పై ఉన్న అంచనాలకు నిదర్శనంగా భావిస్తున్నారు.



# హాయ్ చిత్రం ట్రైలర్ విడుదల




లేడీ సూపర్ స్టార్ నయనతార, టాలెంటెడ్ యంగ్ హీరో కవిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న రొమాంటిక్ డ్రామా మూవీ 'హాయ్'. ప్రముఖ గీత రచయిత విష్ణు ఎడవన్ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆగస్టు 28న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కాబోతుండగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. తమిళంతో పాటు తెలుగు ట్రైలర్‌ను వదిలింది. ఈ ట్రైలర్ ఫుల్ లవ్, ఫన్ మరియు ఎమోషన్స్‌తో ఆకట్టుకునేలా ఉంది. ప్రేమ వివాహాల కోసం ప్రయత్నించి విఫలమయ్యే సామాన్యుడిగా కవిన్ ఇందులో కనిపించగా, ఆయనకు దేవసేన పాత్రలో నటిస్తున్న నయనతార ఎదురుకావడం జరుగుతుంది. సంప్రదాయాలకు భిన్నంగా ఉండే ఒక స్వతంత్ర భావాలున్న మహిళగా నయనతార లుక్ చాలా ఆకర్షణీయంగా ఉంది. అనుకోని పరిస్థితుల నేపథ్యంలో వీరిద్దరికీ పెళ్లి జరగడం, ఆ తర్వాత వారి మధ్య జరిగే మనస్పర్థలు, భావోద్వేగాలు ఈ సినిమా ప్రధాన కథాంశంగా ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. కవిన్, నయనతార ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా ఉండి సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇక ఈ చిత్రంలో నయనతార, కవిన్‌లతో పాటు కే. భాగ్యరాజ్, ప్రభు, రాధికా శరత్‌కుమార్ వంటి దిగ్గజ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు జెన్ మార్టిన్ సంగీతం అందిస్తుండగా, రాజేష్ శుక్లా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. జి స్టూడియోస్ సౌత్, రౌడీ పిక్చర్స్ మరియు సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి.

# బాలీవుడ్ ఎంట్రీపై భాగ్యశ్రీ బోర్సేకు షాక్..

## ఆ వార్తల్లో నిజం లేదంటూ క్లారిటీ!

టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన ఓ బాలీవుడ్ వార్త తాజాగా ఆసక్తికరంగా మారింది. బాలీవుడ్ స్టార్ హీరో ఆదిత్య రాయ్ కపూర్, దర్శకుడు మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ లవ్‌స్టోరీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా ఎంపికైందంటూ గత కొద్దిరోజులుగా జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా బాలీవుడ్ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ స్పందించింది. ఈ ప్రచారాన్ని టీ-సిరీస్ ప్రతినిధులు అధికారికంగా ఖండించారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు.ఆదిత్య రాయ్ కపూర్, మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం భారీ అంచనాలు ఉన్నాయి. ప్రేమ, యాక్షన్, ఎమోషన్స్ మేళవింపుతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు మిలాప్ జవేరీ గతంలో వెల్లడించారు. ప్రేమకథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని చూపించిన మిలాప్ జవేరీ.. 'మర్జావాన్', 'ఏక్ దివానే కీ దివానియత్' వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈసారి ఆదిత్య రాయ్ కపూర్‌తో మరింత ఇంటెన్స్ లవ్‌స్టోరీని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. భాగ్యశ్రీ బోర్సేకు బాలీవుడ్ కొత్తేమీ కాదు. 'యారియాన్ 2', 'చందు ఛాంపియన్' వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించిన ఆమె.. హీరోయిన్‌గా మాత్రం ఇప్పటివరకు పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కించుకోలేదు. ఆదిత్య రాయ్ కపూర్ సినిమా ద్వారా బాలీవుడ్‌లో హీరోయిన్‌గా గ్రాండ్ ఎంట్రీ ఇస్తుందంటూ వచ్చిన వార్తలు కూడా ఇప్పుడు అవాస్తవంగా తేలాయి.భాగ్యశ్రీ బోర్సే రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా అడుగుపెట్టింది. తొలి సినిమాతోనే తన గ్లామర్‌తో పాటు నటనతోనూ తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత వరుస అవకాశాలు ఆమె తలుపు తట్టాయి.దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి, సముద్రఖని కీలక పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'కాంత' లోనూ భాగ్యశ్రీ నటించింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన్' చిత్రంలోనూ భాగ్యశ్రీ హీరోయిన్‌గా కనిపించింది. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ సరసన కమల్ హాసన్ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'సేయోన్' సినిమాలో నటిస్తోంది.

Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450